# ఆషామాషీ

## రావూరు వెంకట సత్యనారాయణ రావు

**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

## -168-

(11 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**మేము ఎరుగున్న** ఒక కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములున్నారు. ఒకాయన రిజిష్టరాఫీసు గుమస్తా, ఒకాయన ఉపాధ్యాయుడు, మరో ఆయన అప్పర్ డివిజన్ గుమస్తా. ముగ్గురూ మూడు ఊళ్ళల్లో కాపురం.

మూడో ఆయన బ్రహ్మచారి. పెద్దాయన సదాచారి. రెండో ఆయన శాంతాచారి.

ఏది ఎలా వున్నా ఆ కుటుంబం అంతా కాలాన్ననుసరించి ఏదో విధంగా జీవితాలు గడుపుకుంటూ వస్తున్నారు 'లేదు' అనే మాట రానియ్యకుండా "వాదు"ల్లోకి దిగకుండా. ఎంతో ఘనంగా ఇంతవరకు పాత కాలెండర్లు తీసి క్రొత్త కాలెండర్లు గోడకు తగిలిస్తున్నారు.

వారెంత మంచిగా వుండి కాలాన్ని తరుముకు వస్తున్నా ఈనాటి పరిస్థితుల్లో వున్న చేదు వారిని ఎంతో బాధపెట్టడం ప్రారంభించింది. తియ్యటి మనస్సులుగల ఆ సోదరత్రయం చేదు గుటకలు వేయడానికి ఎంతగానో బాధపడటం తప్పలేదు పాపం.

అందువల్ల వారిలో ఒకరికి తెలియకుండా ఒకరికి జీవితం మీద విరక్తి ఏర్పడింది. పెద్దవారిద్దరూ ఇక ఈ సంసారం చెయ్యడం దుర్భరం. ఈ బండి దిగి, 'సన్యాస ఆశ్రమానికి చేరే బాట పట్టుకుందాం' అని నిశ్చయించుకున్నారుట. మంచిరోజు చూసి ఈ విషయం బయట పెట్టాలనుకున్నారుట.

ఆ అవకాశం ముందుగా రెండో ఆయనే తీసుకున్నాడు. అన్నదమ్ముల్ని తన యింటికి పిలిపించి "ఇదే మీకు నా చివర ఆతిధ్యం. ఆషాఢమాసం రాగానే ఆశ్రమ స్వీకారం చేస్తున్నా. నాకు ఆడపిల్లలు లేరు కనుక అట్టే ఇబ్బందిలేదు. మగ నలుసుల్ని పెట్టుకుని మా ఆవిడ ఎక్కడో అక్కడ కాలక్షేపం చేస్తుంది. పైన మీరున్నారుగా. కొంచెం చూస్తూ వుండండి" అని చెప్పాడుట.

ఆమాటలు విన్న అన్నదమ్ములు ఎంతో చకితులయ్యారుట. అందులో అన్నగారు మరీన్నీ. ఆయనకు తమ్ముడి మాటలో తనకు పోటీ కూడా గోచరించింది.

వెంటనే ఇలా అన్నాడట "అదేమిటి నువ్వు ఆశ్రమం పుచ్చుకోవడమేమిటి? చిన్నా పెద్దా ఏమీ ఆలోచించుకో అక్కరలేదా? ఇంట్లో నేనున్నానని మరచిపోయావా? పొరుగు వూళ్ళో ఉన్నంత మాత్రాన నువ్వు స్వతంత్రుడు వయ్యావా? ప్రధమంగా ఆశ్రమం స్వీకరించే హక్కు నాకుంది. నీకెక్కడిది?" అని అరిచాడట.

"అదేమిటన్నయ్యా అలా కోప్పడతావు. ఆశ్రమంలో చేరడానికి హక్కేమిటి? అది వసతిని బట్టి వుంటుంది అలాటి వసతులు నాకు భగవంతుడు అందచేశాడు. నీకు అంత అవసరం కనిపించలేదు. పైగా నువ్వు ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలి. నువ్వు ఆశ్రమం పుచ్చుకుంటే పెళ్ళి బాధ్యత తప్పించుకుని పారిపోయావంటారు. పైగా అమ్మాయి ఎంతో వేదన పడుతుంది జీవితమంతా" అన్నాడుట రెండో ఆయన.

"మీరున్నారు కాదటోయ్ ఇద్దరు బాబాయిలు. ముద్దుగా వుంది పేరుకూడా. ఈ శీర్షికతో పేరుకూడా వ్రాయొచ్చు. లేదా ఒక ఫిలిం తియ్యొచ్చు. అన్న కుమార్తెకు మాత్రం పెళ్ళి చెయ్యలేదేమిటి? ఆశ్రమ స్వీకారం అంటే ఏమిటి? ఈ లోకం నుంచి కాకపోయినా ఇంట్లోనించి నిష్క్రమించిడమే గనుక లేనివాడితో సమానమే. అలాటప్పుడు అన్నదమ్ములు సర్దుకోరూ వ్యవహారాలన్నీ" అన్నాడు అన్నగారు.

"అదేం కుదరదన్నయ్యా ఆశ్రమ స్వీకారానికి కావలసిన అర్హతలు మీకంటే నాకెక్కువ వున్నాయని నేను చక్కగా నిరూపించగలను. దీనికోసం ఒక కమిటీ వేసి పరిశీలన జరిపించినా తప్పకుండా నన్నే సెలెక్ట్ చేస్తారు. కనుక అంత దూరం పోకుండా మీరే అనుమతిస్తే ఎంతో సంతోషిస్తాను. మంచిరోజు నిర్ణయించుకుంటాను" అన్నాడట రెండో ఆయన.

మన దేశ సాంప్రదాయం ప్రకారం, వయస్సుకు అగ్రస్థానమివ్వాలిగాని ఇతర అర్హతలకు ప్రాధాన్యమివ్వకూడదు. వయస్సును గౌరవించడం మన సంస్కృతికి చెందిన మూల సూత్రం.

పైగా పై నెలనుంచీ నేను ఫించను పుచ్చుకోబోతున్నాను. ఫించను మొత్తం ఒకేసారి అడుగుతున్నాను. అప్పులు తీర్చి, తక్కింది మా ఆవిడపేర బ్యాంకులో వేస్తాను, కనుక నా నిర్ణయానికి మీరెవరూ అడ్డురాకండి. అన్నగారి మాట పాటించి మన వంశ గౌరవాన్ని నిలబెట్టండి" అన్నాడాయన.

"అలా అయితే శ్రీరామచంద్రమూర్తితో లక్ష్మణుడు వెళ్ళినట్లు నేనూ మీతో వచ్చేస్తాను. మన ఇద్దరి సంసారాల బాధ్యతలూ తమ్ముడు వహిస్తాడు. చక్కగా నిర్వహిస్తాడనే నమ్మకం కూడా నాకుంది. వాడు అపర భరతుడుగా ప్రఖ్యాతి చెందుతాడు" అన్నాడు రెండో ఆయన.

"అన్నలారా మీ యిద్దరి కాళ్ళకు ఒకేసారి దణ్ణం పెడతాను. మిమ్మల్ని అభినందిస్తాను. మీరు ఆశ్రమాలు పుచ్చుకోకుండా వుంటే ఎంతైనా సేవిస్తాను. అంతేగాని నామీద మీ సంసారాల బాధ్యత మాత్రం పెట్టి వెళ్ళకండి."

"అంత శిక్ష నాకు వెయ్యకండి. నేనేం పాపం చేశానని అలా సూచించావు చిన్నన్నన్నయ్యా! వేస్తే మరో శిక్ష ఏదైనా వెయ్యి. అసలు సంసారమంటేనే నాకు సింహ స్వప్నం. నేనసలు వివాహం చేసుకోవాలని అనుకోవడంలేదు. బ్రహ్మచారిగా

జీవించడంలో కొంత పరమార్ధమున్నది ఈ కాలంలో నేను అలా వుండిపోదలచుకున్నాను పెద్ద అన్నయ్యా. సమయం వచ్చింది గనుక ఇలా చెప్పవలసి వచ్చింది అన్నయ్యా.

చెప్పినందుకు నన్ను క్షమించండి. సంసార బాధ్యతనుంచి నన్ను రక్షించండి. నేనో అప్పర్ గ్రేడ్ గుమస్తానన్ మాట మీరు మరిచిపోకండి. ఎంత కుటుంబ నియంత్రణ అమలు జరిపినా  భార్యా మరి ముగ్గురు పిల్లల్ని పోషించే స్తోమతు నాకుండదని గ్రహించండి.

ప్రతిరోజూ నేను మనస్సును హెచ్చరిస్తున్నాను..'తస్మాత్ జాగ్రత్త' అని. సంసారాలు నడపడం గమ్మత్తు కాదు. రోజూ మీరు పత్రిక సరిగ్గా చదవరు. దయతలచి నన్ను ఇలా వదిలెయ్యండి అన్నయ్యలూ" అని అతడు దీనాతిదీనుడై భ్రాతృ మూర్తుల్ని ప్రార్ధించినవాడైనాడు.

తమ్ముడిచ్చిన దీర్ఘోపన్యాసానికి అన్నలిద్దరూ ఆశ్చర్య చకితులయ్యారు. అసలు ఏం జవాబు చెప్పాలో తోచలేదు వారికి. కొంతసేపటికి రెండో అన్న "ఏమిటి పెళ్ళిచేసుకోవా? ముందే అంత భయపడితే ఎలాగురా?" అన్నాడుట.

"చిన్నన్నయ్య.. నువ్వు ఆలోచించి చెప్పు. ముందు భయపడడం మంచిదో, సంసారంలో రోజుకు నాలుగుసార్లు గుడ్లు తేలవేసి, గోడనానుకుని కూర్చుని కొనవూపిరితో లేచి వెళ్ళడం మంచిదంటావో దాంపత్య శోభ అనుభవించడానికి దక్షత వుండాలన్నయ్యా. నువ్వు వ్రాసుకున్న డైరీలో ఒక్క అయిదు పేజీలు తీసి చదువుకో అన్నయ్యా. నా సంగతి అర్ధమవుతుంది" అన్నాడు ఆ కనిష్టుడు.

తమ్ముడు చెప్పిన మాటలు విని తన స్థితి అంతా జ్ఞాపకం వచ్చి తన సంసారాన్ని మనస్సులో పెట్టుకునే తమ్ముడిలా చెపుతున్నాడని అర్ధమై, వేదనలో మునిగిపోయాడుట ఆ విషాద సోదర మధ్యముడు.

అప్పుడు అగ్రజుడిలా అన్నాడుట. "ఈ రోజుకీ చర్చ ముగిద్దాం. నాకు రైలు వేళ అయింది. రాత్రికి కొంపకు చేరుకోవాలి. తెల్లారి ఆఫీసులో చేరి తల మోదుకోవాలి. సంసారంలో వున్నన్నాళ్ళూ ఆ సాగరాన్ని ఈదుకోవాలి అయినా సన్యాసం పుచ్చుకోదలచినప్పుడు సంప్రదింపులేమిటి? వేదాంతంలో పడి పారిపోయే వాళ్ళకు వీడ్కోళ్ళేమిటి? ఎవరికి వారే యమునా తీరే. నేను బయలుదేరుతున్నా" నని లేచాడుట.

అప్పుడు రెండో ఆయన భార్య సావిట్లోకి దుమికి "అంతా వింటూనే వున్నా. సంసారాల్నే మఠాలుగా మార్చారు మావారు. ఇంక వేరే ఆశ్రమమెందుకు? అని భర్తవంక చూసి "స్వామీ! మీకు మ్రొక్కుతాను. కొన్నాళ్ళు ఇక్కడే వుండి తర్వాత నన్ను కూడా వెంట పెట్టుకుని వైకుంఠానికి వెళ్ళండి. మధ్యలో మరో మజిలీ మఠం దేనికి?" అందిట.

ఆ మాటతో బావగారు చెప్పులు తొడిగి గొడుగు చేత పట్టారుట. మరిది బుష్ కోటు భుజాన వేసుకుని వీధిలోకి వెళ్ళి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడట.

Post your comments